www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 12 మార్చి 2025

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

ప్రజాశక్తి - కడప అర్బన్: దేశాభివృద్ధిలో మహిళలు చాలా కీలక పాత్ర పోషిస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని నేటితరం విద్యార్థులు రాణించాలని యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ పిలుపునిచ్చారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలోని తాళ్లపాక అన్నమాచార్య సెనేట్ హాల్లో ఉమెన్ సెల్ ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' ఎక్సలెంట్ యాక్షన్ అనే థీమ్‌తో మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డి సభకు అధ్యక్షత వహించగా గౌరవ అతిథిగా హాజరైన ఆచార్య పద్మ మాట్లాడుతూ పురుషులతో సమానంగా సమర్థవంతంగా పనిచేస్తున్న మహిళలను అభినందించారు. విద్య, ఆరోగ్యం, ఐటి, పరిశోధన, అంతరిక్ష రంగాల వంటి అన్ని రంగాల్లో మహిళలు అత్యంత సమర్థవంతంగా రాణిస్తున్నారని ఉదహరించారు. మహిళలు తమ ఆకాంక్షల మేరకు సమానత్వం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

హైడ్రో ప్రాజెక్టులకు బాలారిష్టాలు

జిల్లాలో హైడ్రో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల పురోగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్న చందంగా మారింది. గత వైసిపి సర్కారు హయాంలో జిల్లాకు ఆరు హైడ్రో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు 1,017 ఎకరాల విస్తీర్ణంలో 5,600 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్ ఉత్పాదన చేయడానికి ముందుకు వచ్చాయి. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చింది. జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గానికి చెందిన బిజెపి నాయకుల దౌర్జన్యాలు, దాడులు, కేసుల చోటుచేసుకున్న నేపథ్యంలో జిల్లాకు పరిశ్రమలు రావడానికి పునరాలోచనలో పడ్డాయనే వాదన వినిపిస్తోంది. రెండు హైడ్రో పంప్డ్ స్టోరేజీ పరిశ్రమల యాజమాన్యాలు వెళ్లిపోగా, నాలుగు పరిశ్రమలు మాత్రమే 3,200 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన సామర్థ్యంతో ఏర్పాటు చేయడానికి సైతం మీనమేషాలు లెక్కిస్తుండడం గమనార్హం.

జమ్మలమడుగు బిజెపి నేతల దాడుల ప్రభావం

ఆరు ఎనర్జీ సంస్థల్లో రెండు సంస్థలు రాంరాం

3,200 మెగావాట్ల ఉత్పాదనకు పడిపోయిన వైనం

1,017 ఎకరాల భూసేకరణకు కసరత్తు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో హైడ్రో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు బాలారిష్టాలను ఎదు ర్కొంటున్నాయి. 2019- 2024 వైసిపి సర్కారు హయాంలో జిల్లాలోని గండికోట రిజర్వాయర్, సోమశిల రిజర్వాయర్, పైడిపాలెం ఈస్ట్, పైడిపాలెంవెస్ట్ రిజర్వాయర్, వేంపల్లి మండల ప్రాంతాల్లో 1017 ఎకరాల విస్తీర్ణంలో 5,600 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేయడానికి హైడ్రో పంప్డ్ స్టోరేజీ సంస్థలు ముందుకు రావడం తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అధికారం చేతులు మారడంతో జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గానికి చెందిన ఇద్దరు బిజెపి నాయకుల దాడులు, దౌర్జన్యాలు, కేసుల కారణంగా ఆరు ఇంధన సంస్థల్లో రెండు సంస్థలు పరిశ్రమల ఏర్పాటు నుంచి వెనకడుగు వేయడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోని కొండాపురం మండల పరిధిలో కె.బొమ్మేపల్లి గ్రామ సమీపంలో 41.99 ఎకరాల్లో 1,000 మెగావాట్ల సామర్థ్యంతో మరో 191.64 ఎకరాల్లో అదానీ గ్రీన్ ఎనర్జీ సంస్థ ఏర్పాటుకు ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. పైడిపాలెం రిజర్వాయర్ పరిధిలోని ముద్దనూరు మండల పరిధిలోని మంగపట్నం, కొర్రపాడు, సింహాద్రిపురం మండలంలోని పైడిపాలెం గ్రామంలో 466.27 ఎకరాల్లో 1,200 మెగావాట్ల సామర్థ్యంతో, మరో 317.14 ఎకరాల్లో 1000 మెగావాట్ల సామర్థ్యంతో ఇండో సోల్ సోలార్ ప్రయివేటు లిమిటెడ్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. గోపవరం మండల పరిధిలోని రాచాయపేట గ్రామ సమీపంలోని సోమశిల రిజర్వాయర్ వెనకజలాల ప్రాంతాల్లో షిరిడీసాయి ఎలక్ట్రికల్స్ ప్రయివేటు లిమిటెడ్ 900 మెగావాట్ల సామర్థ్యం, వేంపల్లి మండలం వెలమవారిపల్లి ప్రాంతాల్లో 1,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన సామర్థ్యంతో ఏర్పాటు చేయడానికి ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే.

ఆరింటిలో నాలుగు సంస్థలే..!

కొండాపురం మండలం బొమ్మేపల్లి గ్రామంలో అదానీ సంస్థ హైడ్రో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ఏర్పాటు వ్యవహారంలో జమ్మలమడుగుకు చెందిన ఇద్దరు రాష్ట్ర స్థాయి బిజెపి నాయకులు దాడులు, దౌర్జన్యాలు, కేసుల వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. జిల్లాలో ప్రాజెక్టుల ఏర్పాటుకు ముందుకు వచ్చిన ఆరు హైడ్రో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల్లో రెండు ప్రాజెక్టుల యాజమాన్యాలు వెనుకడుగు వేశాయనే వాదనవినిపిస్తోంది. జిల్లాలోని ఆరు హైడ్రో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల నుంచి 5,600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ ఉత్పాదన కావాల్సి ఉండగా, 3,200 మెగావాట్లకు పడిపోవడం గమనార్హం.

ఏళ్ల తరబడి డిపిఆర్ దశలోనే

జిల్లాలో అదానీ, షిరిడీ సాయి, ఇండోసాల్ కంపెనీలు హైడ్రో పంప్డ్ స్టోరేజీ పరిశ్రమల ఏర్పాటు డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారీ దశలో ఏళ్ల తరబడి సాగుతోంది. హైడ్రో పంప్డ్ స్టోరేజీ పరిశ్రమలన్నీ రెవెన్యూ, ఫారెస్ట్ భూముల్లో ఏర్పాటు చేయాల్సిన నేపథ్యంలో ఫారెస్ట్ భూముల సేకరణ ఆలస్యానికి కారణమని తెలుస్తోంది. హైడ్రో పంప్ట స్టోరేజీ ప్రాజెక్టులకు అనుమతి లభించడానికి కేంద్ర అటవీ పర్యావరణ శాఖ పరిధిలోని 11 డైరెక్టరేట్ల నుంచి అనుమతులు లభించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది.

మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్‌ఫొటో)

జిల్లా ఇన్‌ఛార్జి అధికారుల నియామకం

వైఎస్ఆర్‌కు సౌరబ్‌గౌర్, అన్నమయ్యకు వినయ్‌చంద్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ప్రభుత్వం జిల్లా ఇన్‌ఛార్జి బాధ్యులుగా సీనియర్ ఐఎఎస్ అధికారులను నియమించింది. సోమవారం రాష్ట్రంలోని 26 జిల్లాల వారీగా ఐఎఎస్ అధికారులను నియమించింది. వైఎస్ఆర్ జిల్లా ఇన్‌ఛార్జి అధికారిగా సౌరబ్‌గౌర్, అన్నమయ్య జిల్లాకు వాడరేరు వినయ్‌చంద్‌లకు బాధ్యతలు అప్పగించింది. వీరిద్దరూ ప్రభుత్వ కార్యక్రమాలను పర్యవేక్షణ, అమలు బాధ్యతలను చూడాలి. జిల్లాలోని ఆయా శాఖల మధ్య సమన్వయం, సమస్యలను సత్వరం పరిష్కరించాలి. 15 రోజులకు ఒకసారి సమీక్షా సమావేశాలు నిర్వహించాలి. నెలకు రెండు సార్లు గ్రామాల్లో బస చేయాలి. నెల వారీగా ప్రోగ్రెస్ రిపోర్టును ఇన్‌ఛార్జి, ప్రధాన కార్యదర్శులకు అందజేయాలి. వీరికి సహాయకారులుగా జోనల్ ఇన్‌ఛార్జులుగా సీనియర్ ఐఎఎస్ అధికారులను నియమించింది. వైఎస్ఆర్ జిల్లాకు జి.అనంతరాము, అన్నమయ్య జిల్లాకు ఎం.టి కృష్ణబాబులను నియమించింది. వీరిద్దరూ ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలకు వ్యూహాత్మక మార్గదర్శకత్వం వహించాలి. నెల వారీ సమీక్షలు నిర్వహించాలి. జిల్లా స్థాయి కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు ప్రభుత్వ కార్యక్రమాల్లో సహాయ పడాలి. ఉదాహరణకు ప్రతి నెలా ఒకటవ తేదీన ఫించన్ల పంపిణీ, మూడవ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను పర్యవేక్షించాలి. ప్రజాఫిర్యాదుల పరిష్కారస్థితిని సమీక్షించాలి. ప్రభుత్వ కార్యక్రమాల్లో అవాంతరాలను గుర్తించి, జాప్యానికి గల కారణాల విశ్లేషించాలి. ముఖ్యమైన ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు, వ్యయాల్ని సమీక్షించాలి. జిల్లా పురోగతి సమస్యలను, సిఫారసులను ముఖ్యకార్యదర్శికి నివేదించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది.

సౌరబ్‌గౌర్

వినయ్‌చంద్

ఆస్పత్రిని సీజ్ చేస్తున్న అధికారులు

ఫ్లోరెన్స్ ఆస్పత్రి సీజ్

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

పట్టణంలోని విజయనగరం వీధిలో ఉన్న ఫ్లోరెన్స్ ఆస్పత్రని మంగళవారం సీజ్ చేశారు. ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ సాయి ప్రసాద్ పేరుతో నిర్వహిస్తున్న ఆసుపత్రిలో అనుమతులు లేకుండా కాన్పులు, ఆపరేషన్లు నిర్వహిస్తున్న కారణంగా సీజ్ చేసినట్లు డిప్యూటీ డిఎంహెచఒ శివప్రసాద్ రెడ్డి తెలిపారు. ఒకే ప్రాంగణంలో ఉండి ఆసుపత్రిలో కాన్పులు నిర్వహిస్తుంటే డాక్టర్ సాయిప్రసాద్ తనకు తెలియదని చెప్పడంపై వైద్యశాఖ అధికారులు ఆగ్రహించారు. ఆయన్ను ఆసుపత్రి నుంచి బయటకు పంపి అధికారులు ఆసుపత్రిని సీజ్ చేశారు. నర్స్ రాజీ కాన్పులు చేస్తుండడంతో సీజ్ చేసినట్లు సమాచారం. ఇదే ఆసుపత్రిని రెండేళ్ల కిందట ఇలాంటి కాన్పులే చేయడంతో సీజ్ చేసినట్లు తెలిసింది. అప్పట్లో తాత్కాలిక అనుమతులు తీసుకుని మళ్లీ కాన్పులు చేయడం మొదలుపెట్టినట్లు సమాచారం.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : సిఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

రోడ్డుపై ప్రయాణిస్తున్న, నడుస్తున్న, వాహనాలు నడుపుతున్న ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సిఐ జావిద్ పేర్కొన్నారు. మంగళవారం ఆర్‌టిసి రీజినల్ కార్యాలయ సమావేశ మందిరంలో డ్రైవర్లకు సూచనలు చేశారు. డ్రైవింగ్ చేస్తున్న సమయంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. బస్సు ఆపేటప్పుడు ట్రాఫిక్కుకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. ఫుట్ బోర్డు పైన ప్రయాణం చేయడం నేరం అన్న విషయాన్ని ప్రయాణికు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వాహనదారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రమాదాలు సంభవిస్తే వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా నష్టపోతారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌టిసి ఆర్ఎం గోపాల్‌రెడ్డి, డిఎం ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ జావిద్

ఉపన్యాస పోటీల పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి- కడప అర్బన్

యువతలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారికి మంచి అవ కాశాలు కల్పిస్తున్నారని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. వికసిత్ భారత్ నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ -20 25 పోస్టర్లను జెసి మంగళవారం ఆవిష్కరించారు. ఇలాంటి అవకాశాన్ని యువ త సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. నెహ్రు యువ కేంద్ర యువ అధికారి మణికంఠ మాట్లాడుతూ కడప, అన్నమయ్య జిల్లాలలోని 18 -25 సంవ త్సరాల మధ్య వయస్సు గల యువత ఈ పోటీలలో పాల్గొనవచ్చని పేర్కొ న్నారు. ఈ 'పోటీలు వన్ నేషన్ వన్ ఎలక్షన్' అనే అంశం పై ఉపన్యాస పోటీలు ఉంటా యని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 15న కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఫిజికల్ మోడ్‌లో ఉంటాయని తెలిపారు. ఇతర వివరాలుకు 9177616677లో సంప్రదించాలని కోరారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి

మంచి ర్యాంకులతో ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి- చింతకొమ్మదిన్నె : పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ఒత్తిడిని జయించి పరీక్షలు రాస్తే విజయం సొంతం అవుతుందని పేర్కొన్నారు మండల విద్యాశాఖ అధికారి వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మూలవంక జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో గ్లోబల్ డెవలప్‌మెర్ సంస్థ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని మండల విద్యాశాఖ అధికారి వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా ఉచి తంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ 10వ తరగతి జీవితంలో ఒక టర్నింగ్ పాయింట్ అని ప్రతి ఒక్కరూ మంచి మార్కులు సాధించి, జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలని అటు విద్య చెప్పిన గురువులకు, ఇటు తల్లిదండ్రులకు పేరు తీసుకువచ్చేలా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్లోబల్ సంస్థ మండల కో-ఆర్డినేటర్ రహీ మునిషా పాఠశాల హెచ్ఎం మహమ్మద్ ఇర్షాద్, ఉపాధ్యాయులు మునీం సాహెబ్, సతీష్ పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తప్పవు

ప్రజాశక్తి - కడప ప్రభుత్వ నిబంధనలకు లోబడే గ్యాస్ సిలిండర్లను వినియోగదారులకు సరఫరా చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని కలెక్టం శ్రీధర్ చెరుకూరి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు హెచ్చరికలు జారీచేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని పిజిఆర్ ఎస్ హాలులో జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో జెసి అదితిసింగ్‌తో కలిసి సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు వంటగ్యాస్ భారం కాకుండా దీపం-2 పథకం ద్వారా వంట గ్యాస్ సిలిండర్ ధర మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తూ సంవత్సరానికి 3 సిలిండర్లను ఉచితంగా అందిస్తోందన్నారు. ఈ నేపథ్యంలోరాష్ట్రంలో గ్యాస్ సరఫరా ఎలా జరుగుతోందన్న విషయమై ఐవిఆర్ఎస్ సర్వే నిర్వహిస్తోందన్నారు.

14న 'నిరుద్యోగ వ్యతిరేక సదస్సు'

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళాగా ఉన్న ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని ఈనెల 14న నిరుద్యోగ వ్యతిరేక సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో 'నిరుద్యోగ వ్యతిరేక సదస్సు' కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ హాజరై దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నిరుద్యోగ యువతీ, యువకుల సమస్యలను వివరిస్తారని తెలిపారు. దేశంలో లోపభూయిష్టమైన విద్యా వ్యవస్థను ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని, దేశ ప్రగతిని అడ్డుకుంటున్న నిరుద్యోగంపై పోరాడాల్సిన తక్షణ కర్తవ్యం నేటి యువత పైన ఉందని, దేశంలోని ఒక్క శాతం సంపన్నులకు దేశ ప్రజల శ్రమతో సృష్టించబడిన సంపదలో 40 శాతం పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోచిపెడుతున్నాయని విమర్శించారు. మోడీ 11 సంవత్సరాల పరిపాలనలో 200 మంది శతకోటేశ్వరులను సృష్టించారని, రాష్ట్ర విభజన చట్టంలోని అత్యంత వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో నిర్మిస్తామని చెప్పిన 'కడప ఉక్కు ఫ్యాక్టరీ' ప్రభుత్వ రంగంలో నిర్మించడానికి ప్రయత్నం చేయలేదని ఎద్దేవ చేశారు. యుటిఎఫ్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు ప్రజా అనుకూల మేధావులు సిపిఎం నిర్వహిస్తున్న నిరుద్యోగ వ్యతిరేక సదస్సుకు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, బి.మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, కె.శ్రీనివాసులు రెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు ఐ.ఎన్. సుబ్బమ్మ , డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.చిన్ని, వి.శివకుమార్ పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

నెలలోపు టిడ్కో ఇళ్లు మంజూరు చేయకపోతే

గృహ ప్రవేశాలు చేస్తాం : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

అధికా రంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వని కూటమి ప్రభుత్వం, కనీసం టిడ్కో ఇళ్లను మంజూరు చేయాలని సిపిఎం నాయ కులు డిమాండ్ చేశారు. మంగ ళవారం నగర శివాలయంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌ల నిర్మించిన టిట్కో ఇళ్లను సిపిఎం నాయకుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం టిడ్కో ఇళ్లను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. వాటిని పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. టిట్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు రూ. 25 వేల నుంచి రూ.50 వేలు, లక్ష చొప్పున చెల్లించారని, వాటిని పూర్తి చేసి మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు అందజేయాలని తెలిపారు. ఐదేళ్ల కిందట లబ్ధిదారులతో వేల రూపాయలు వసూలు చేశారని తెలిపారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని చెప్పి ఇంతవరకు పేదలకు సెంటు స్థలం ఇచ్చిన దాఖలాలు లేవని అన్నారు. టిడ్కో ఇళ్ల పైన జిల్లా ప్రజా ప్రతినిధులు శాసనసభ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. టిట్కో ఇళ్ల స్థలాల కోసం రానున్న కాలంలో సిపిఎం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు, ఇళ్లు లేని పేదలను సమీకరించి ఆందోళన పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి స్థానిక పార్టీ నాయకులు గోవిందు, నరసింహ, పేదలు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు అభినందనీయం : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్: పోలీసులతో పాటు సమానంగా విధులు నిర్వర్తిస్తూ అందరి మన్ననలు చూరగొంటున్న హోం గార్డుల సేవలు అభినందనీయం, స్ఫూర్తిదాయకమని ఎస్‌పి అశోక్ కుమార్ కొనియాడారు. మంగళవారం డీమొబి లైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా హోం గార్డ్స్ పెరేడ్(కవాతు)ను పరిశీలించి, గౌరవ వందనాన్ని స్వీకరించారు. పెరేడ్‌ను ప్రతిభావంతంగా, క్రమశిక్షణతో చూడచక్కగా చేశారని అభినందించారు. శిక్షణకాలం అనేది కీలకమని, విద్య నేర్చుకున్న అనంతరం సమాజానికి ఉపయోగపడకపోతే ఆ విద్యకు విలువ ఉండదని పేర్కొన్నారు. పదిహేను రోజుల్లో మీరు నేర్చుకున్న అంశాలను దైనందిన విధుల్లో ప్రతిబింబించేలా చూడాలన్నారు. దేశ అంతర్గత భద్రతను పరిరక్షించడంలో హోం గార్డ్స్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి కె.శ్రీనివాస రావు, ఆర్ఐలు శ్రీశైలరెడ్డి, ఆనంద్, టైటస్, వీరేష్, శివరాముడు, ఆర్ఎస్ఐలు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పు శంకర్, హోం గార్డుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - కడప అర్బన్ : వేమన విశ్వవిద్యాలయంలో రక్తదాన శిబిరానికి విస్తృత స్పందన లభించింది. యోగివేమన విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం, కళాశాల ఉత్సవంలో భాగంగా మంగళవారం జాతీయ సేవా పథకం-9, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (రిమ్స్ -కడప) ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం వైవీయూ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. ప్రిన్సిపల్ ఆచార్యులు ఎస్.రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన యువత ప్రతి ఆరు మాసాలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. తద్వారా మరొకరికి ప్రాణదానం చేసినట్లన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య పద్మ రక్తదానం చేసి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. 75 యూనిట్ల రక్తం వాలంటీర్స్ స్వచ్ఛందంగా ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ రాజేంద్ర, విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి, జాతీయ సేవా పథకం-9 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె. శ్రీనివాసరావు, విశ్వవిద్యాలయ డాక్టర్ నరేష్ కుమార్ రెడ్డి, వైద్య సహాయకులు రెడ్డి బాషా, వాలంటీర్స్ పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప : ప్రధాని నరేంద్ర మోడీ దేశంలోని ముస్లిం మైనార్టీలపై ప్రతీకారంగా వక్ఫ్ సవరణ చట్టం-2024ను తీసు కొచ్చాడని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీఖాన్ విమర్శించారు. కడపలో మంగళవారం నబి కోట, 7 రోడ్ల కూడలి, కాగితాల పెంట తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు కరపత్రాలు ద్వారా విస్తృత ప్రచారం చేశారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కేవలం మత విద్వేష ప్రకారం పరిపాలన చేస్తుందని ఆరోపించారు. ముస్లిం మైనార్టీలను అణగదొక్కేందుకు వక్ ఆస్తులను లూటీ చేసే చట్టంగా దీనిని రూపొందించారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగ విరుద్ధ చట్టంగా కొత్త చట్టాన్ని అభివర్ణించారు. ప్రజలు ఇప్పటికైనా మేలుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కరపత్రాలను ప్రజలకు పంచిపెట్టారు. ప్రజలు చైతన్యవంతులై మత దుర అహంకారాన్ని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మయాన రహమతుల్లాఖాన్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రతినిధి హమీద్ పాల్గొన్నారు.

కరపత్రాలు పంచుతున్న కాంగ్రెస్ నాయకులు

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి : సిసిఎల్ఎ

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న సిసిఎల్ఎ, పాల్గొన్న కలెక్టర్

రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని, జిల్లాలో భూముల రీసర్వే వేగవంతంగా, పకడ్బందీగా నిర్వహించి నివేదికలు సమర్పించాలని సిసిఎల్ఎ జి. జయలక్ష్మి అన్నారు. మంగళవారం విజయవాడ నుంచి రెవెన్యూ సదస్సులు, భూముల రీసర్వేపై అదనపు సిసిఎల్ఎ నక్కల ప్రభాకర్‌రెడ్డితో కలసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిసిఎల్ఎ మాట్లాడుతూ జిల్లాల్లో రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను పరిశీలించి, స్వయంగా వెళ్లి అర్జీదారునితో మాట్లాడి సంతృప్తి చెందేలా పరిష్కారం చేయాలని అన్నారు. భూముల రిసర్వేపై ప్రత్యేక శ్రద్ధ వహించి పకడ్బందీగా నిర్వహించాలని, నివేదికలు పంపాలని, నివేదికల ఆధారంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ విషయంపై క్షేత్ర స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నారు. భూముల రిసర్వే ప్రక్రియ రెవెన్యూ శాఖలో అతి ముఖ్యమైన అంశమని అన్నారు. ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యం వహించకుండా వేగవంతంగా పూర్తి చెయాలని అన్నారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావివ్వక క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు తయారు చేసి పంపాలన్నారు. ఇందుకు ఆయా తహశీల్దార్, విఆర్ఒలు బాధ్యత వహించాలని చెప్పారు. విసికి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జెసి అదితి సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, సర్వే ల్యాండ్ అధికారి మురళీకృష్ణ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత వైసిపి ట్రాక్‌లో పడొద్దు : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్ : వైసిపి నేతల ట్రాక్‌లో యువత పడవద్దని, కేవలం యువతను మభ్య పెట్టేందుకే యువత పోరు తలపెట్టారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జిలాని బాష అన్నారు. మంగళవారం ద్వారకా నగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోనే యువతకు ఉద్యోగ, ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల్లో యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. మెగా డీఎస్సీ ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటే, వైసిపి నాయకులు కుట్ర, కుతంత్రాలతో యువ పోరు నిర్వహించ తలపెట్టడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

ఆలయాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి-కాశినాయన : మండలంలోని కాశిరెడ్డి నాయన ఆలయాన్ని ప్రాణలైన అర్పించి కాపాడుకుందామని తిరుపతి అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి విజయ శంకర్ స్వామి పేర్కొన్నారు అయన మంగళవారం జ్యోతి క్షేత్రాన్ని సందర్శించారు. ఈ మధ్యకాలంలో అటవీశాఖ అధికారులు జ్యోతి క్షేత్రంలో కూలదోసిన భవనాలన పరిశీలించారు. అక్కడ అటవీ శాఖ అధికారులు చేస్తున్న కార్యక్రమాలు అన్ని చూసి అక్కడ కమిటీ వారిని అడిగి తెలుసుకున్నారు అటవీ శాఖ అధికారులు కూలదోసిన ప్రతి భవనం దగ్గరికి వెళ్లి ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిందూ ధర్మానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హిందూ ధర్మాన్ని మరిచి హిందువులను వాడుకొని ఆలయాన్ని పడగొడుతుంటే చూస్తూ ఊరుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. కూటమి ప్రభుత్వానికి తెలకుండా అటవీశాఖ అధికారులు ఇక్కడికి వచ్చి దేవాలయ భవనాలు కూలదోస్తారా అని ఆయన ప్రశ్నించారు. కలెక్టర్ కార్యాలయం ముందు ఆలయాన్ని కాపాడేందుకు ఈనెల 17న ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

కర్నూల్ రేంజ్ డిఐజికి వినతి

ప్రజాశక్తి -కడప అర్బన్

రాయచోటిలో ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు అందించి వెంటనే అమాయకులైన పిల్లలను విడుదల చేయాలని ముస్లిం సమైక్యవేదిక అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ కోరారు. మంగళవారం కర్నూల్ రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్‌కి కర్నూలులోని డిఐజి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్షులు షేక్. ఆరి పుల్ల, ఆళ్లగడ్డ బీరువాల బాషా పాల్గొన్నారు.



డిఐజికి వినతి పత్రం అందజేస్తున్న సలావుద్దీన్

జగన్ ఇంటి ముందు చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్ : రూ.4,271 కోట్లు ఫీజు, వసతి దీవెన బకాయిలు పెట్టింది జగన్ ప్రభుత్వమే అని, ఆయన ఇంటి ముందు యువత పోరు నిర్వహించాలని శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 6 లక్షల మందికి చంద్రబాబు ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వగా దాన్నీ జగన్ ప్రభుత్వం రద్దు చేసి యువతకు ద్రోహం చేసిందని పేర్కొన్నారు. ఎస్‌సిఆర్‌బి నివేదిక ప్రకారం జగన్ పాలనలో 2,100మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఏపీలో జగన్ హయాంలో పెట్టిన ఫీజు బకాయిలు రూ.4,271 కోట్లని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు చెల్లింపునకు కూటమి ఆమోదం తెలిపిందని తెలిపారు. యువత పోరు పేరుతో మరోసారి యువతను మోసం చేసే జగన్నాటకం ఆడుతున్నారని పేర్కొన్నారు.

కపట నాటకాలు కట్టిపెట్టాలి : వైసిపి

ప్రజాశక్తి - కడప : విద్యార్థులను చదువుకు దూరం చేయాలని చూస్తున్న కూటమి ప్రభుత్వం తక్షణమే కపట నాటకాలు కట్టి పెట్టాలని, ప్రభుత్వ కూసాలు కదిలే రీతిలో ఈనెల 12న నిర్వహించబోయే 'యువత పోరు'ను జయప్రదం చేయాలని మాజీ డిప్యూటీ సిఎం అంజాద్ బాషా, నగర మేయర్ కె.సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరంలోని మాజీ ఉప ముఖ్యమంత్రి నివాస కార్యాలయంలో కార్పొరేటర్లు, కో- ఆప్షన్ సభ్యులు, డివిజన్ ఇన్‌ఛార్జులు , కడప నగర జోన్ అధ్యక్షులు, జిల్లా, నగర అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకురాలతో సమావేశం నిర్వహించారు. మీ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల్ని చెల్లించలేదన్నారు. పిల్లల ఫీజులకు అవసరమైనంత డబ్బులు లేక తల్లిదండ్రులు అప్పులు చేస్తున్నారని వాపోయారు. ఇది మంచి పరిణామం కాదని అభిప్రాయపడ్డారు.

సూపరింటెండెంట్‌కు వినతిపత్రమిస్తున్న సిఐటియు నాయకులు

కార్మికులకు జీతాలు వెంటనే ఇవ్వాలి

- ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సిఐటియు నేతల వినతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న 65 మంది కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్ కోరారు. మంగళవారం స్థానిక సూపరింటెండెంట్ ఆనంద్ బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చుట్టుపక్కల ప్రాంతాల వారు వేల సంఖ్యలో ఈ హాస్పిటల్ చికిత్స కోసం వస్తుంటారన్నారు. 350 పడకల జిల్లా ఆసుపత్రికి కేవలం 65 మంది పారిశుద్ధ్య కార్మికులు మాత్రమే పనిచేస్తున్నారని, వారి జీతాలు ఇవ్వడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల పిఎఫ్ కూడా కాంట్రాక్టర్ సరిగా కట్టడం లేదన్నారు. కార్మికులకు ప్రతినెల 5వ తేదీలోపు జీతాలు వేయాలని డిమాండ్ చేశారు. న్యాయబద్ధంగా వారికి పనికి తగ్గ వేతనం ఇచ్చి కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ హాస్పిటల్ యూనియన్ గౌరవాధ్యక్షులు రాఘవేంద్ర, అధ్యక్షురాలు రత్నమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇంటి పన్ను సకాలంలో చెల్లించాలని జమ్మలమడుగు డిఎల్‌పిఒ తిమ్మక్క కోరారు. మండల పరిధిలోని పల్లవోలు పంచాయతీలోని సిబిఐటి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బందితో మాట్లాడుతూ.. గ్రామపంచాయతీకి చెల్లించాల్సిన పన్ను సుమారుగా రూ.28 లక్షల వరకు బకాయి ఉందన్నారు. త్వరగా చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పన్ను చెల్లించకపోతే సంబంధిత సిబ్బందికి శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. సకాలంలో ఇంటి పన్ను చెల్లిస్తే తద్వారా గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో ఇంటి పన్నులు వెంటనే వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ చేస్తున్న కొవ్వూరు రమేష్‌రెడ్డి

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పట్టణానికి చెందిన కొవ్వూరు గ్రాండ్ అధినేత కొవ్వూరు రమేష్‌రెడ్డి కాలేయ మార్పు చేయించుకొని 23 ఏళ్లయిన సందర్భంగా మంగళవారం స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రి రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు 2002లో కాలేయ సమస్య వచ్చిందని, ఈ సమయంలో చాలా ఆసుపత్రులకు తిరిగానని, కానీ భారతదేశంలో వైద్యులు ఈ కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేసే సదుపాయాలు లేవని, లండన్‌కు వెళ్లాలని సూచించారని గుర్తు చేశారు. అది ఖర్చుతో కూడిన వ్యవహారం కావడంతో తాను ఆలోచిస్తున్న తరుణంలో హైదరాబాద్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గ్లోబల్ ఆసుపత్రి వైద్యులు అక్కడ శస్త్రచికిత్స చేస్తామని, తానే మొదటి వ్యక్తి అయినా భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం తాను ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు. ఇటీవలే పులివెందులకు చెందిన చిన్నారికి శస్త్రచికిత్స సమయంలో ఆర్థికసాయం చేశానని పేర్కొన్నారు. ప్రొద్దుటూరు నుండి ఎవరైనా కాలేయ మార్పిడి వంటి శస్త్రచికిత్స చేయించుకోవాల్సి ఉండి, ఆర్థిక సమస్యల్లో ఉంటే తనను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఆనందబాబు, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్, కొవ్వూరు కృష్ణచైతన్యరెడ్డి, నటకుల సతీష్, రామకృష్ణ, ఆరవేటి సుబ్బయ్య, ప్రభాకర్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేయడం తగదు : ఎస్‌టియు

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న మోడల్ స్కూల్ విధానానికి సంబంధించి ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేయొద్దని ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ కూకట్ల పాలకొండయ్య, జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామమోహన్ తెలిపారు. మంగళవారం ఎంఇఒలు పద్మలత, నరసారెడ్డికు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా కమిటీల ద్వారా తీర్మానాలు తీసుకురావాలన్నారు. అలా కాని పక్షంలో తమ కలెక్టర్ చాంబర్‌కు వెళ్లి రెండు పేజీల వివరణ ఇవ్వాల్సి వస్తుందని తెలిపారు. ఎంఇఒ, ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు. మోడల్ పాఠశాలలను నూతనంగా తీసుకురావడం కోసం కొన్ని పాఠశాలలను మూత వేసే అవకాశం ఉందని, తద్వారా బడుగు బలహీన వర్గాల పిల్లలు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్‌ఎంసి సమావేశాలు నిర్వహించిన తర్వాత వారి అభిప్రాయం మేరకు ఏదైనా తీర్మానం చేస్తారో వాటిని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, కమిటీలు విలీనం కావడానికి వ్యతిరేకంగా ఉన్నప్పటికీ, ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చి అనుకూలంగా తీర్మానాలు తీసుకురావాలని భయభ్రాంతులకు గురిచేయడం తగదని తెలిపారు. ఈ విలీన ప్రక్రియలో హైవేలు, వాగులు వంకలు, చెరువులు తదితరమైనవి అడ్డుగా ఉన్న పక్షంలో వాటిని విలీనానికి తీర్మానించకూడదన్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ జి.మల్లేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, రమేంద్రారెడ్డి, బికె సురేష్, మునెయ్య, మీర్ సాబ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఇఒకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కాంట్రాక్టర్ల నిర్వాహకంతో గుట్టలు గుల్ల

అనుమతుల్లేకపోయినా వత్తాసు పలుకుతున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - వేముల

వేముల గ్రామపంచాయతీ మీదుగా వెళుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకు మట్టి తోలుకునేందుకు సదరు కాంట్రాక్టర్లు వారి ఇష్టానుసారంగా గుట్టలను గుల్ల చేస్తున్నారు. ఎలాంటి అనుమతులేకపోయినా ఎక్కడపడితే అక్కడ మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. చెరువుల నుంచి సరిపోక ప్రభుత్వ భూముల నుంచి సైతం అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. వేముల, భూమయ్యగారిపల్లి మధ్యలోని కొండ ప్రాంతంలో అనుమతుల్లేవు. ఇన్నాళ్లు అంటూ టిప్పర్లతో గ్రీన్‌ఫీల్డ్ హైవేకు గత వారం రోజులుగా మట్టి తరలిస్తున్న విషయాన్ని తెలుసుకున్న స్థానిక ప్రజలు అడిగితే.. తమ దగ్గర అన్ని అనుమతులు ఉన్నాయంటూ దబాయిస్తున్నారు. మట్టి తవ్వకాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. దీనిపై స్థానిక విలేకరులు వివరణ కోరగా.. గ్రీన్‌ఫీల్డ్ హైవే వాళ్లు రెవెన్యూ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మట్టి తవ్వకాలు జరుపుతున్నారని పేర్కొన్నారు. అక్రమంగా ప్రభుత్వ భూముల్లో మట్టిని టిప్పర్లతో తోలుతుండగా పలువురు రైతులు అడ్డుకున్నారు. అన్ని తెలిసిన రెవెన్యూ అధికారులు హైవే అధికారులకు వత్తాసు పలుకుతూ వారి అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక రైతులు విలేకరులకు దృష్టికి తేగా.. అక్కడికి వెళ్లి విలేకరులు ప్రశ్నిస్తే అప్పుడు స్థానిక వీఆర్ఏ ద్వారా ఆ టిప్పర్లను మిషన్లను బయటకి పంపించారు. తహశీల్దార్ ఇందిరాదాజిని వివరణ కోరగా.. కొద్ది రోజుల నుంచి అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నారని విషయం చెప్పినప్పటికీ గ్రీన్‌ఫీల్డ్ హైవే వాళ్లు ప్రభుత్వం చేపడుతున్న రహదారులు ఏర్పాటుకు వాడుతున్నారు కాబట్టి.. ఇరిగేషన్ శాఖ నుంచి అయినా మట్టి తవ్వకాలకు అనుమతి తీసుకుని ఉండొచ్చు అని తహశీల్దార్ ఫోన్‌లో విలేకరులకు తెలిపారు. స్థానిక ప్రజల అభ్యంతరం లేకుండా రెవెన్యూ అధికారుల అనుమతులతో మట్టి తోలుకోవాలని గ్రామస్తులు, రైతులు సూచిస్తున్నారు.

మట్టి తరలింపునకు సిద్ధంగా ఉన్న యంత్రాలు

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- తుంగభద్ర ప్రాజెక్టు హై లెవెల్ కెనాల్ చైర్మన్ జోగిరెడ్డి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని తుంగభద్ర ప్రాజెక్టు హై లెవెల్ కెనాల్ ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చెర్లోపల్లె పంప్ హౌస్ నుండి స్విచ్ ఆన్ చేసి గ్రావిటీ ద్వారా పిబిసి కాలువలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల నియోజవర్గంలో చీని, అరటి, ఇతర పండ్ల తోటల నీటి సమస్య కారణంగా ఎండిపోకుండా నీటి తడులు అందించేందుకు కాలువలకు నీరు విడుదల చేస్తున్నామన్నారు. రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. పైడిపాలెం ప్రాజెక్టు నుంచి కాలువ ద్వారా చెర్లోపల్లి పంప్‌హౌస్‌కు 100 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. చెర్లోపల్లి పంప్‌హౌస్ నుంచి లిఫ్ట్ ద్వారా పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు ఒక మోటర్ సహాయంతో 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. పులివెందుల బ్రాంచ్ కెనాల్ ఇఇ రాజ శేఖర్, గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ ఇఇ శ్రీనివాసులు, డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి విడుదలకు పూజ చేస్తున్న మారెడ్డి జోగిరెడ్డి

పంట నమోదులో అభ్యంతరాలుంటే చెప్పొచ్చు

పంట నమోదు ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎడి ప్రభాకరరెడ్డి

ప్రజాశక్తి - లింగాల

రబీలో సాగు చేసిన పంట నమోదు వివరాలను గ్రామసభల ద్వారా రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నట్లు పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకరరెడ్డి తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఆయన మండల పరిధిలోని మురారిచింతల రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 1,939 మంది రైతులకు సంబంధించి 5,281 ఎకరాల పంట నమోదు జాబితాను సిద్ధం చేశామన్నారు. రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు పూర్తయిందన్నారు. ఇ పంట అర్హులైన జాబితాను ప్రదర్శిస్తున్నామన్నారు. సంబంధిత జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 18లోపు రైతులు తెలియజేయలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమేష్, గ్రామ వ్యవసాయ సహాయకుడు గోపి, రైతులు పాల్గొన్నారు.

వేముల : రబీలో ఇ పంట నమోదులో జాబితా చూసి ఏవైనా అభ్యంతరాలు ఉంటే మూడు రోజుల్లోపు చెప్పవచ్చని ఎడి ప్రభాకర్‌రెడ్డి, ఎఒ వి.చెన్నారెడ్డి సూచించారు. మండలంలో నల్లచెరువు పల్లె రైతు సేవా కేంద్రం పరిధిలోని రబీ సీజన్‌కు సంబంధించి మంగళవారం ఇ పంట నమోదు ప్రక్రియ గ్రామసభను ఎడి ప్రభాకర్‌రెడ్డి, ఎఒ వి.చెన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. రబీ సీజన్‌లో పంట నమోదు చేసుకున్న రైతుల వివరాలను రైతు సేవ కేంద్రం ఇన్‌ఛార్జి నాగ సుదర్శన్ చదివి వినిపించారు. రైతుల జాబితా వివరాలను రైతు సేవా కేంద్రంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎఒ వి.చెన్నారెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఈ రబీ సీజన్ లో 3,778 మంది రైతులు 11,555 ఎకరాలలో పంట నమోదు చేసుకున్నారని తెలిపారు. పంట నమోదుతోపాటు ఇకెవైసి చేయించుకున్న రైతులకు మాత్రమే పంటల బీమా, పెట్టుబడి రాయితీ, మద్దతు ధరకు పంటలు కొనుగోలు వర్తిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్ కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

చాపాడు : వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మ్యాగీ సూచించారు. మండల పరిధిలోని వెదురూరు గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతూ భూ ఆధార్ కార్డుకు స్థానిక రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ తదితర పథకాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా ప్రస్తుతం 2 ఇంచుల నీటి పైపులు సబ్సిడీ ద్వారా అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యవసాయ పరికరాలు, మందు పిచికారి స్ప్రేయర్లు రాయితీలోకి రాగానే సమాచారం ఇస్తామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, విఎఎ జెరుషా రైతులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారి మ్యాగీ

నాటుసారా మానేద్దాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

పోస్టర్‌ను విడుదల చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

'నాటుసారా మానేదాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం' అని తహశీల్దార్ మహమ్మద్ నజీర్, ఎక్సైజ్ అధికారి చెన్నారెడ్డి, పట్టణ సిఐ నరసింహులు కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం నాటుసారా నిర్మూలన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటుసారా అమ్మడం, తయారీ, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. ఈ నేరానికి ఎనిమిదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.5లక్షలు వరకు జరిమానా విధిస్తారన్నారు. సారా తాగడం వల్ల ఆరోగ్యం చెడిపోవడంతోపాటు కుటుంబం చిన్నాభిన్నం అవుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మంగారి సన్నిధిలో యాంకర్ శ్యామల

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో స్వామిని మంగళవారం వైసిపి పి రాష్ట్ర అధికార ప్రతినిధి, యాంకర్ శ్యామల, ఆమె భర్త దర్శించుకున్నారు. వీరికి ఫిట్‌పర్సన్ శంకర్ బాలాజీ ఆధ్వర్యంలో సిబ్బంది ఆలయం మర్యాదలతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి ఎనిమిదో తరం మనవడు శ్రీ వెంకటాద్రి స్వామి, శ్రీ దత్తాత్రేయ స్వామి వారిని దర్శించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. శ్యామల దంపతులను సన్మానించారు. కాలజ్ఞానం విశేషాలను వివరించారు. కార్యక్రమంలో బద్వేల్ జడ్‌పిటిసి పోలిరెడ్డి, అమగంపల్లి ప్రభాకర్‌రెడ్డి, ఆమగంపల్లి సర్పంచ్ భర్త సురేష్, మఠం వైసిపి నాయకులు బద్దెల శ్యాంసుందర్‌రెడ్డి, యల్లటూరు శివారెడ్డి, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఆలయంలో శ్యామల దంపతులు, నాయకులు

వైద్య విద్యలో విద్యార్థులందరూ సమానమే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్టయిఫండ్ విషయంలో అసమానతలు లేకుండా చూడాలని పశువైద్య విద్యార్థులు సూచించారు. ఎంబిబిఎస్ విద్యార్థుల వలె తమకు స్టయిఫండ్ పెంచాలని రాష్ట్రవ్యాప్తంగా వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 37వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తాము 37 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా గౌరవ వేతనం పెంచాలని దీక్ష చేపడుతున్నా, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులను కలిసినా సమస్యలను పట్టించుకునే నాథుడే లేడన్నారు. వైద్య వృత్తి చేస్తున్న వారిలో అసమానతలు చూపకుండా సమానంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న పశువైద్య విద్యార్థులు

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

తెలుగుగంగకు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి - చాపాడు

తెలుగుగంగలో అంతర్భాగమైన బ్రహ్మసాగర్ రిజర్వాయర్‌ను నింపే ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించాలని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మంగళవారం అసెంబ్లీలో మాట్లాడారు. బి.మఠం రిజర్వాయర్ సామర్థ్యం 17 టిఎంసి అన్నారు. ప్రాజెక్టుకు వర్షపు నీరే దిక్కయిందన్నారు. తెలుగుగంగకు నీటి వాటాను కేటాయించాలని కోరారు. కుందూ నది నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా బ్రహ్మసాగర్‌కు నీటిని తరలించేందుకు గత ప్రభుత్వంలో రూ.528 కోట్ల టెండర్లను పిలిచారని, ఆ తర్వాత నిధులు కేటాయించకపోవడంతో పనులు మొదలు కాలేదన్నారు. ఈ పథకానికి సంబంధించి నిధులు మంజూరు చేసి తెలుగుగంగకు శాశ్వతంగా నీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. బ్రహ్మసాగర్‌లో పూర్తిస్థాయిలో నీటిమట్టం ఉండడం వల్ల మైదుకూరు, బద్వేల్ నియోజకవర్గ రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఉపాధి చేకూరుతుందని ఆయన వివరించారు.

సరుకులు అందజేస్తున్న టిడిపి నాయకులు

పేద కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తనయుడు పిఆర్‌కె హాస్పిటల్ అధినేత పుట్టా రవికుమార్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మైదుకూరు ఇందిరమ్మ కాలనీలో మంచానికే పరిమితమైన రాముకు చేయూతగా సరుకులు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ యాపరాల చిన్న, టిడిపి పట్టణ ఉపాధ్యక్షుడు యాపరాల లక్ష్మీనారాయణ, బురుగోళ్ల చిన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందిరమ్మ కాలనీ వాసుల సమక్షంలో పుట్టా రవికుమార్ జన్మదిన కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బండి అమర్నాథ్, తవ్వా చంద్రఓబుల్‌రెడ్డి, తప్పేట శ్రీధర్‌రెడ్డి, చౌక్కం సురేంద్ర, వెంకటేష్, సిరివెళ్ల రాజ్‌కుమార్, గురు ప్రసాద్, విష్ణు, రాహుల్ పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న ఉమాదేవి

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి అన్నారు. మంగళవారం ఆమె తన నివాసంలో పులివెందుల నియోజకవర్గంలోని వివిధ మండలాలకు సంబంధించి 14 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేయడం చాలా సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కడప జిల్లా పార్లమెంటు కార్యదర్శి బొజ్జ మైసూరారెడ్డి, తాళ్లపల్లె వెంకటేశ్వరరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ అధ్యక్షుడిగా పత్తి కృష్ణారెడ్డి

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పూసలకొట్టాల సమీపంలో కడప-కర్నూలు జాతీయ రహదారి వద్ద ఉన్న అయ్యప్ప ఆలయ అధ్యక్షుడిగా ఖాజీపేటకు చెందిన పత్తి కృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఆలయ కమిటీ అధ్యక్ష ప్రక్రియ సమావేశం ఇటీవల జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్ష పాలకవర్గ ఎన్నిక చేపట్టారు. ఆలయ అధ్యక్షుడిగా పత్తి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఉండేల వీరరాఘవరెడ్డి, అంబోరు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి మోక్ష గుండం ఆచారి, కోశాధికారి మునగాని శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుంకు సత్యనారాయణ, ఉపకోశాధికారిగా బి.తులసీశ్వర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మంగళవారం మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తాము కట్టుబడి కృషి చేస్తామన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను పలువురు సన్మానించారు. రాజకీయ నాయకులు, ఆర్యవైశ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సభ్యులను సన్మానించిన పలువురు

IN THE COURT OF THE MACT-CUM- PRINCIPAL DISTRICT JUDGE, KADAPA

M.V.O.P.No. 316/ 2024

H.Surendra @Suri. **...Petitioner**

Vs

1) Pallipaga Parasuramaiah, S/o. China Subbarayudu, Hindu, aged about 40 years, Driver of the Scorpio No. AP.04.TV.1581, Residing at Rama Samudram, Pullampeta Mandal, now at Ram Nagar, Rajampeta Town and Mandal, Annamayya District. Cell. No.7286902482.

...Respondent No.2

NOTICE TO REPONDENT NO.2.

The above noted address is the Driver of the Scorpio No. AP.04.TV.1581 and caused the accident by you to petitioner on received serious injuries. After that injured petitioner filed above case for compensation against you and two others. The said case posted to 24-03-2025 for your appearance. So you may appear on the day by personally or through advocate by way of filing vakalath as well as counter. If you failed to appear on that day, otherwise matter will be decided in your absence.

//By Order of the Court//

G.V.CHALAPATHI

Advocate,

Kadapa.AP. Cell No.9154901010.

ప్రకటన

నేను, కె.ఎస్.ఈశ్వర్, తండ్రి పేరు వినోద్ కె, ఫ్లాట్ నెం.301, 4వ అంతస్తు, ఎస్.జె.ఆర్. హెూమ్స్, భట్టరహళ్లి, విరుగొనగర్ పోస్ట్, బెంగళూరు - 560 049లో నివాసం ఉంటున్నాను. నాకు కడప, ఆంధ్రప్రదేశ్‌లో సర్వే నెం. 14/4లో 0.50 ఎకరా విస్తీర్ణంలో ఉన్న ఆస్తికి నేను మాత్రమే యజమానిని.

పైన పేర్కొన్న షెడ్యూల్ 'బి' ఆస్తిని రిజిస్టర్డ్ విభజన దస్తావేజు ద్వారా పొందినది, రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం. 480/2010, తేది 21 ఫిబ్రవరి 2009 ప్రకారం, కడప నుండి బెంగళూరుకు బస్సులో ప్రయాణిస్తుండగా ఈ దస్తావేజు పోయింది, అప్పటి నుండి చాలా వెతికినా ఆచూకీ లేదు. ఆస్తి 'బి' షెడ్యూల్ వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి.

కడప, ఆంధ్రప్రదేశ్‌లో సర్వే నెం. 14/4లో 0.50 ఎకరా విస్తీర్ణంలో ఉన్న ఈ భూమి తూర్పున రాశి కాంపౌండ్ గోడ, పశ్చిమాన ప్రభుత్వ రహదారి, ఉత్తరాన 'ఎ' షెడ్యూల్‌లోని రాశి కాంపౌండ్ గోడ, దక్షిణాన సొంత డ్రైనేజీ సరిహద్దులుగా ఉన్నాయి. పైన పేర్కొన్న ఆస్తి మరియు పత్రాలకు సంబంధించి ఎవరికైనా ఎలాంటి దావాలు లేదా ఆసక్తి ఉన్నట్లయితే, వారు ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 7 రోజులలో దిగువ సంతకం చేసిన వారికి సంబంధిత పత్రాలతో దాఖలు చేయాలి. ఆ తర్వాత వచ్చిన ఎలాంటి దావాను పరిగణించబడదు/బంధించబడదు. ఒకవేళ ఎవరి దగ్గరైనా ఈ పత్రం ఉంటే, దయచేసి ఈ మొబైల్ నెం. **8296577288**కు సంప్రదించగలరు.

పైన పేర్కొన్న ఆస్తి పత్రాలు పోయినందున, ఈ విషయాన్ని ప్రతిష్టాత్మక దినపత్రికలో ప్రచురించాం. ఇది మీ దయగల సమాచారం కోసం, దయచేసి పోగొట్టుకున్న పత్రాలను పైన పేర్కొన్న చిరునామాకు అందజేయవలసిందిగా లేదా నా మొబైల్ నెం.: 8296577288కు చేరవలసిందిగా కోరుతున్నాను.

ఎమ్. మంజునాథ్